# అమృత హస్తం

బర్త్‌డే గ్రీటింగ్స్ చెప్పేందుకు సినీ ప్రముఖులెందరో వినోద్ ముంగిట్లోకొచ్చి నిలబడ్డారు. వారందరి చేతుల్లో పూలదండలు, బొకేలు ఉన్నాయి.

వినోద్ మెగాస్టారేంకాదు.

డైనమిక్ అండ్ డాషింగ్ హీరో అంతకన్నా కాదు. జస్ట్ స్క్రిప్ట్‌రైటర్.

సినిమాకు సంభాషణలు సమకూర్చే రచయితకు ఇంత ఆదరణా? ముందెన్నడూ ఎవరికీ లభించనని కారణం అతడు మాటలు రాసిన ప్రతిచిత్రం విజయవంతం కావడమే. ప్రేక్షకుల హృదయాలను కదిలించగల సత్తా అతడి డైలాగులలో ఉంటుంది. తను పుచ్చుకున్నది అంతంత మాత్రమేనా నిర్మాతలకు లక్షలు సంపాదించిపెట్టాడు. వాళ్ళను కోట్లలో ముంచెత్తాడు. అందుకే ప్రతి ప్రొడ్యూసరు తను తీసే చిత్రానికి వినోదే మాటలు రాయాలని తపించిపోతాడు. ఫలానా చిత్రానికి వినోద్ మాటలు రాశాడంటే చాలు ఆ సినిమా రికార్డు స్థాయిలో కలక్షన్లు అందుకున్నట్లే. మరి అటువంటప్పుడు ఫీల్డులోని వ్యక్తులు అతడికి బ్రహ్మరథం పడుతున్నారంటే ఆశ్చర్యం ఏముంది?

మల్లె పూవులాంటి తెల్లని దుస్తుల్లో వినోద్ కనిపించడంతోనే "హేపీ బర్త్‌డే టు యు" అంటూ అతడిని పూలమాలలతో ముంచెత్తారు. కెమేరాలు క్లిక్‌మన్నాయి.

వచ్చిన వాళ్ళు వందల సంఖ్యలో ఉండటంతో ఆ కార్యక్రమం ముగిసేసరికి సరిగ్గా గంటపట్టింది.

అనంతరం అందరూ తేనీటి విందు స్వీకరించారు.

"మీరు మాటలు రాసిన మా చిత్రం శతదినోత్సవానికి పరుగులు తీస్తోంది. మా తదుపరి చిత్రానికి కూడా మీరే మాటలు రాసిపెట్టాలి" నిర్మాతల అభ్యర్థనలు ప్రారంభమయ్యాయి.

"చిత్రాలన్నిటికీ నేనే మాటలు రాయాలంటే పరిశ్రమలోని మిగతా వాళ్ళేం కావాలి? పైగా నాకు సమయం చాలడం లేదు. ఇప్పటికే పాతిక చిత్రాలకు అగ్రిమెంటిచ్చాను. శక్తికి మించిన చిత్రాలకు సంభాషణలు రాసుకుంటూపోతే వాటిలో నాణ్యత లోపిస్తుంది. నవ్యత కనిపించదు" సున్నితంగా వారి అభ్యర్థనను తోసిపుచ్చాడు వినోద్.

అంతా వెళ్ళిపోయారు.

వినోద్ ఆరోజు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలనుకున్నాడు. కాగితాలు, కలాలు కంట బడకుండా తన గదికి లాక్ చేసి హాల్లో కొచ్చికూర్చున్నాడు. తను ఈ నాడింత బిజీ రైటరు అవుతాడని కలలో కూడా అనుకోలేదు.

టీపాయి మీద ఉన్న ఆల్బం తీశాడు.

పరిశ్రమలోని ప్రముఖులతో వివిధ సందర్భాలలో తీయించుకున్న ఫోటోలు ఎన్నో ఎన్నెన్నో.

మొదటి పేజీ తిప్పగానే చిరునగవుతో సాక్షాత్కరించింది.... అదృష్టదేవత. ప్రతి పురుషుని

విజయం వెనుక ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఓ స్త్రీ హస్తం ఉంటుందంటారు. అది అక్షరాలా తన విషయంలో ఋజువైంది.

తన ఉన్నతికి ఊపిరిపోసి, అభ్యున్నతికి హారతిపట్టి అంతర్ధానమైన ఆ దేవతను చూడటంతోనే వినోద్ కళ్ళు వర్షించాయి. ఉన్న పళంగా గతంలోకి జారుకుందతడి మనసు.

★ ★ ★

రోజూ మధ్యాహ్నం పోస్టు కోసం ఎదురు చూడటం వినోద్ దినచర్యలో ఒక భాగం.

ఎప్పటిలాగే టపాకోసం నిరీక్షిస్తున్న వినోద్‌కి పోస్టుమాను నరసింహులు కనిపించాడు.

ఆశగా చూశాడతడివంక.

నాలుగు కవర్లు చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు నర్సింహులు. 'ప్చ్' నిట్టూర్చాడు వినోద్.

అవి పత్రికల నుండి తిరిగొచ్చిన కథలని అతడికి తెలుసు. రోజూ తను ఎదురుచూసేది ప్రచురణకు తన రచన స్వీకరింపబడిందన్న శుభవార్త కోసం. తన అదృష్టం ఏమిటో మరి ఎన్ని కథలు వ్రాసి పంపినా ఒక్కటంటే ఒక్కటి కూడా అచ్చుకు నోచుకోవడం లేదు. అలాగని ప్రయత్నం విరమించాడా?... ఊహూ పట్టువదలని విక్రమార్కుడిలా ప్రతి రోజూ కథలు రాస్తూ పోస్టు చేస్తూనే ఉన్నాడు. వారం తిరక్కుండానే అవి క్షేమంగా తిరిగొస్తున్నాయి.

సంపాదకులకు తన రచనలు ఎందుకు నచ్చడంలేదో ఎంత బుర్రబద్దలు కొట్టుకుంటున్నా అతడికి అర్థం కావడంలేదు. ఆ విషయం నిర్ధారణ చేసుకోవడానికి ప్రముఖ కథారచయిత సోమేశ్వరంగారిని కలిశాడు. స్వపరిచయం చేసుకుంటూ తను రాసిన రెండు మూడు కథల్ని చూపించాడు.

"నేనో పని చెప్తాను చేస్తావా?" అన్నాడు సోమేశ్వరం వ్రాత ప్రతుల్ని అటు ఇటు చూసి.

ఏమిటన్నట్లు చూశాడు వినోద్.

"ఇవాల్టి నుండి నువ్వు కథలు రాయడం మానేయ్.

సోమేశ్వరం గారి సలహాకు ఖంగుతిన్నాడు వినోద్.

"లేకపోతే మరేమిటయ్యా. కథ ఇలాగేనా రాసేది? ఇందులో శిల్పం ఏది? ఏ చెత్త రాసినా పత్రికల వాళ్ళు వేసేస్తారనా నీ ఉద్దేశ్యం?"

ఎద్దేవా చేస్తున్నట్లున్నాయి సోమేశ్వరంగారి మాటలు.

దెబ్బతిన్నట్లైపోయాడు వినోద్.

తన సాహిత్యం అంత పనికిరానిదైనప్పుడు కాలేజిలో చదువుకునే రోజుల్లో తను రాసిన నాటకాల్ని ఎందుకు ప్రదర్శించేవారు? తన రచల్ని మెచ్చుకుని కొలీగ్స్ తనకు కవిశేఖర, కవి చక్రవర్తి బిరుదు లెందుకిచ్చారు? ఆలోచిస్తున్న కొద్దీ అతడికి పిచ్చెక్కుతోంది.

వినోద్ అవస్థను గమనించిన సోమేశ్వరం "చూడు మిస్టర్, పుస్తకాలు చదవకుండా రచనకు పూనుకోవడం మన తెలుగువారి దౌర్భాగ్యం. అందుకే మన సాహిత్యం ప్రపంచ సాహిత్యంతో పోటీపడలేక పోతోంది. కథకు శ్రీకారం చుట్టేముందు ప్రసిద్ధ కథకుల కథల్ని

చదవాలి. వారిశైలిని వంటబట్టించుకోవాలి" అంటూ ఓ ఉచిత సలహా పారేసి లోపలకెళ్ళి పోయాడు.

అతడి సలహామేరకు వినోద్ కనిపించిన ప్రతి పుస్తకం కొని చదవడం ప్రారంభించాడు. ఖర్చు పెరిగింది తప్ప ఆశయం నెరవేరడం లేదు. నిజానికి ఇతరుల పుస్తకాలు చదివి రాయడం వల్ల తనకంటూ ప్రత్యేకమైన శైలి ఉండదన్నది అతడి స్థిరమైన అభిప్రాయం. వ్యవహారిక భాషలో మొట్టమొదట కథ ఎలా ఉండాలో అత్యద్భుతంగా వ్రాసి చూపించిన గురజాడ ఎవరి కథలు చదివాడు? నాటి ఆ ప్రముఖ రచయితకు ప్రేరణ ఎవరు? ఇలా ఎన్నో ఆలోచనలు అతడి మెదడును కుమ్మరిపురుగులా దొలిచేస్తున్నాయి.

వినోద్ కాలేజీ గోడలు దాటి ఏడేళ్ళవుతోంది.

కథలు కడుపు నింపవురా. పనికిరాని రాతల జోలికి పోకుండా శ్రద్ధగా చదివి పోటీ పరీక్షలకు ప్రిపేరవు" కలం తెరిచినప్పుడల్లా కాకిగోల పెట్టేవాడు తండ్రి.

ఉద్యోగం చేసి ఇల్లు కట్టాలని గాని, వ్యాపారం చేసి బోలెడంత డబ్బు సంపాదించాలని గాని కోరిక లేదు. తననో రచయితగా పాఠకలోకం గుర్తిస్తే అదే పదివేలని భావించాడు. ఇంట్లో పెద్దవాళ్ళ పోరు పడలేక గడపదాటాడు. ట్యూషన్లు చెప్పుకుంటూ స్వతంత్రంగా జీవిస్తున్నాడు. వచ్చిన ఆదాయంలో మూడొంతులు పుస్తకాలకి, పోస్టేజికి వెచ్చిస్తున్నాడు. రాత్రింబవళ్లూ నిద్రాహారాలు మాని రచనలు చేస్తున్నాడు. ఎంత శ్రమపడ్డా ఒక్క రచన కూడా ప్రచురణకు నోచుకోకపోవడంతో రచనా వ్యాసాంగం మీద వెగటు పుట్టింది. "కథలు కడుపునింపవన్న" తండ్రి సూక్తి గుర్తుకొచ్చి ఆ రోజుతో సాహిత్యానికి చరమగీతం పాడాలని నిర్ణయించుకున్నాడు. అప్పటికే తను రెండు వందల కథలు రాశాడు. వాటినేం చేయాలో బోధపడలేదు. స్వయంగా ముద్రించుకుందామంటే ఆర్థిక స్తోమతలేదు. తను వ్రాసిన కథలు బాగులేకపోవచ్చు. ఎన్నుకున్న ఇతి వృత్తాలు మాత్రం ఉదాత్తమైనవి. వాటిని లబ్ధప్రతిష్టులు వ్రాయడానికి పూనుకుంటే కళాఖండాలు వెలువడతాయి. అందులో సందేహం లేదు.

ఉన్నట్లుండి అతడి మస్తిష్కంలో మెరుపులాంటి ఆలోచన మెరిసింది.

"నా రెండు వందల అముద్రిత కథల్ని అమ్మకానికి పెట్టాను. ఆసక్తిగల రచయితలు సంప్రదించి వాటిని కొనుగోలు చేసుకోవచ్చు" అంటూ పత్రికా ప్రకటన పారేసి ఊపిరి పీల్చుకున్నాడు వినోద్.

పదేహేను రోజుల అనంతరం ఒక అపరిచిత వ్యక్తి నుండి జాబు వచ్చింది...

వినోద్ గారికి...!

నమస్సులు...

మీ ప్రకటన చూశాను. మీ కథల్ని ఎంతకి అమ్మదలచుకున్నారో ఆ మొత్తానికి వి.పి. పార్శిలు పంపండి. డబ్బు కట్టి బంగీ విడిపించు కుంటాను.

ఇట్లు

మీ అభిమాని

అంత త్వరగా తన ప్రకటనకు ప్రతిస్పందన లభిస్తుందని ఊహించని వినోద్ ఉత్తరం చదివి ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. తన రచనలు క్యాష్ అవబోతున్నందుకు మురిసిపోయాడు. ముప్పై రూపాయల కొక కథ చొప్పున అమ్మినా ఆరు వేల రూపాయలు వస్తాయి. దాంతో తన ఆర్థిక పరిస్థితి కొంత మెరుగవుతుంది అనుకుని వెంటనే అలమరాలో మూలుగుతున్న వ్రాత ప్రతుల్ని బయటకు లాగి పార్సిలు చేశాడు.

కాలగర్భంలో ఆరు మాసాలు ఇట్టే కలిసిపోయాయి.

ఒక రోజు వినోద్ గది కొచ్చిందో మహిళ. ఆమెకు సుమారు పాతికేళ్ళుంటాయి. సన్నజాజి తీగలా ఎంతో నాజూకుగా ఉంది. మెడలో సన్నని చెయిను, చెరో చేతికి అరడజను గాజులున్నాయి. వేషధారణను బట్టి ఆమె గొప్పింటి ఆడబడుచని అర్థమైపోయింది. అందమైన ఆ మోము ఎక్కడో చూసినట్లనిపించిందతడికి. ఎక్కడ చూశాడో స్ఫురణకు రావడం లేదు.

"వినోద్ గారూ!

కంఠం కూడా సుపరిచితమే.

"మీరు" తడబడుతున్నాయి వినోద్ పెదవులు.

"నివ్వెర పోవద్దు. నేను మీ క్లాస్ మేట్ అమృతని. గుర్తు చేసిందామె.

ఔను. తను, అమృత ఒకే కాలేజిలో చదువుకున్నారు. ఆమె గొప్పింటి బిడ్డ. రోజూ కాలేజీకి కార్లో వచ్చేది. ఆమె తండ్రి ఒక బిజినెస్ మాగ్నెట్. శ్రీమంతుల బిడ్డైనా అమృత ఎంతో నిగర్వి. అందరితో ఎంతో కలుపుగోలు తనంగా మాట్లాడేది. అయినప్పటికీ తనామెతో మాట్లాడిన సందర్భాలు మాత్రం బహుఅరుదు.

"అలా నిలబడే ఉన్నారు. కూర్చోండి" కుర్చీ చూపించాడు వినోద్.

"నేను మీకో పుస్తకం కానుకగా ఇవ్వాలని వచ్చాను" పుస్తకం అందించి కుర్చీలో చతికిలబడింది అమృత.

ముఖచిత్రం చూడముచ్చటగా ఉంది. నెమ్మదిగా ఒక్కో పేజీ తిరగేశాడు. ఆశ్చర్యం... అందులో ఉన్న కథలన్నీ తను వ్రాసినవే. అంటే ఆమె తన కథల్ని కొనేసి తన పేరున అచ్చు వేయించుకుందన్న మాట. ఔను. ఆమె శ్రీమంతురాలు. ఏం చేసినా చెల్లుతుంది. ఆనాడు ఓ చిన్న రచనని అచ్చులో చూసుకోవాలని ఎంతగానో తపించిపోయాడు. ఇప్పుడిన్ని కథల్ని ఒక్కసారే చూస్తున్నా సంతోషించలేక పోతున్నాడు. కారణం అవన్నీ అమృత కథలుగా మారిపోవడమే. ఉన్నట్లుండి ఆమె పట్ల అసూయ జనించింది. కోపం పెల్లుబికింది. మరుక్షణం తన అసూయకు అర్థం లేదనిపించింది. విక్రయించిన వస్తువుపై తనకెక్కడ ఉంటుంది అధికారం. కొనుగోలు చేసిన వ్యక్తి ఆ వస్తువును ఏమైనా చేసుకోవచ్చు అనుకుని సమాధానపడ్డాడు.

తరువాత అతని దృష్టి ముఖచిత్రం మీద ఉన్న అక్షరాల మీద పడింది.

"వినోద్ కథలు"

ఇప్పుడు తన కళ్ళను తనే నమ్మలేక పోతున్నాడు. ఒక్కసారి పరవళ్ళు త్రొక్కిందతడి

అంతరంగం.

క్షణం క్రితం ఆమెను ఎంతో అల్పంగా ఊహించాడు. ఇప్పుడామె అతని కళ్ళకు దేవతలా కనబడుతోంది.

"మీ ఔదార్యానికి, ఔన్నత్యానికి నా జోహార్లు" అప్రయత్నంగా చేతులు జోడించాడు వినోద్.

"చదువుకునే రోజుల్లోనే మీ టాలెంటు గుర్తించాను. పత్రికా ప్రోత్సాహం లేనందునే మీరు రచనా వ్యాసంగానికి స్వస్తి చెప్పాలనుకున్నారని మీ ప్రకటన వల్ల అర్థమయింది. మీలో దాగి ఉన్న రచనా తృష్ణ సమాధి కాకూడదన్న సదుద్దేశంతో నేనీ పని చేయడానికి సాహసించాను" అంది అమృత.

కళ్ళతోనే కృతజ్ఞతలు తెలియజేశాడు వినోద్.

కథా సంకలనం వెలువడిన కొద్ది రోజులకే వినోద్‌కి సినిమా ఛాన్సు తగిలింది. అతను వ్రాసిన కథ నొకదానిని చిత్రీకరించి తెరకెక్కిస్తానని ముందుకొచ్చాడో నిర్మాత.

వినోద్ ఆనందానికి అంచుల్లేవు.

వెంటనే హక్కులు రాసిచ్చాడు.

సినిమా సూపర్ హిట్టయింది.

దాంతో తమ చిత్రాలకు మాటలు రాసిపెట్టమని మరికొంత మంది నిర్మాతలు ముందుకొచ్చారు.

వాళ్ళు అడగడమే ఆలశ్యం. కలం విప్పాడు వినోద్.

తన ఉన్నతికి ఆలంబనమైన అమృత మూర్తికి కృతజ్ఞతలు తెలియజేయడానికి ఆమె ఇంటికి బయల్దేరాడు.

బర్తతో విహార యాత్రకెళ్ళిన అమృత కారు ప్రమాదంలో మరణించిందన్న వార్త విని హతాశుడయ్యాడు. ప్రపంచం బ్రద్ధలైపోయినట్లయింది. మనసంతా శూన్యమైపోయింది.

అమృత తన కథల్ని ఆనాడు పుస్తక రూపంలో అచ్చువేయించి ఉండకపోతే తనకు ఈనాడిన్ని అవకాశాలు లభించి ఉండేవి కావు. ఆమెను తన అదృష్ట దేవతగా తలచాడు. అదృష్టమన్నది ఎవరికి ఎప్పుడు ఏ రూపంలో వస్తుందో చెప్పలేం. మనసులో ముద్రించుకున్న అమృత రూపాన్ని తన అదృష్ట దేవతగా ఆ రోజే ఆల్బంలో ప్రతిష్ఠించుకున్నాడు. అప్పుడప్పుడు ఆమెను తలచుకునని రెండు కన్నీటి చుక్కలు విడుస్తాడు.

"సార్ మీకు ఫోను" పి.ఏ. పిలుపుతో వినోద్ ఆలోచనలకు తెరపడింది. చెమ్మగిల్లిన కళ్ళను కర్చీఫ్‌తో వత్తుకుంటూ వెళ్ళి ఫోనెత్తాడు.

**(21-8-1997 మహిళ ఆంధ్రప్రభ డైలీ అనుబంధం)**